నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | గురువారం 11 జూలై 2024 | HANUMAKONDA



# కరెంటు ఇవ్వరు.. సాగు సాగదు

## హక్కు పత్రాలిచ్చినా పంటలకు దిక్కులేదు

పోడు రైతులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కు ప్రతాలిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 53 వేల మందికి 1,47,702 ఎకరాలకు పట్టాలిచ్చింది. సాగునీటి వసతి కోసం ఐటీడీఏ ద్వారా గిరి వికాసం పథకాన్ని అమలు చేసింది. తీరా ఈ పథకం కింద బోర్లు వేసుకొని పంట సాగు చేసుకుందామనుకుంటే అటవీ శాఖ అధికారులు అడ్డు తగులుతున్నారు. విద్యుత్ లైన్లు వేయకుండా మోకాలడ్డుతున్నారు. సొంత డబ్బులతో స్తంభాలు పాతుకొని, బోర్లు వేసుకున్న వారినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని ఐటీడీఏ చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా సాగు లేక పోడు భూములు బీడుగా మారుతున్నాయి.

*- ఏటూరునాగారం, జూలై 10*

### విద్యుత్ లైన్లను అడ్డుకుంటున్న అటవీ శాఖ

- సొంతంగా బోర్లు వేసుకున్నా ఫలితం శూన్యం
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న గిరిజనులు
- బీడుగా మారుతున్న పోడు భూములు



రామనాథం పొలంలో ఏడాది క్రితం పాతిన కరెంటు స్తంభాలు

కరెంట్ లేక నిరుపయోగంగా ఉన్నబోరు

అటవీహక్కుల చట్టం కింద గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన భూములకు సాగునీటి వసతి లేక పంటలు పండించ లేని పరిస్థితి నెలకొంది. జిల్లాల విభజన అనంతరం ఈ భూములను అభివృద్ధి పరిచి సాగునీటి సౌకర్యం కల్పించేందుకు గిరి వికాసం పథకాన్ని అమలు చేసింది. దీంతో ఐటీడీఏ ద్వారా బోర్లు వేసి కరెంటు లైన్ ఇవ్వాలని అధికారులకు గిరిజనులు వినతిపత్రాలు ఇచ్చారు. కొందరు సొంతంగా బోర్లు వేసుకొని కరెంటు లైన్ కోసం ప్రయత్నాలు చేశారు. అయితే అటవీశాఖ అధికారులు మాత్రం విద్యుత్ లైన్లు వేయకుండా అడ్డుపడుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో అటవీ హక్కుల చట్టం కింద పంపిణీ చేసిన భూముల్లో ఇందిర జల ప్రభ పథకం కింద 2017లో వేసిన బోర్లకు సైతం ఇంతవరకు కరెంటు సరఫరా లేదు. రైతులు సొంతంగా కరెంట్ స్తంభాలు తెచ్చుకుంటే అటవీశాఖ అధికారులు అడ్డుకొని వాటిని పట్టుకుపోయారు. తమ భూముల్లో బోర్లు వేసుకుని సాగు చేసుకునేలా అనుమతి ఇవ్వాలని గిరిజనులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. గిరిజనేతరులు పోడు సాగు చేసుకుని బోర్లు వేసుకుంటే పట్టించుకోని అటవీశాఖ అధికారులు తమను మాత్రం ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సౌకర్యం లేక వేల ఎకరాలు బీడుగా ఉంటున్నాయని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ములుగు జిల్లా పరిధిలో సుమారు 1,067 మంది గిరిజన రైతులు గిరివికాసం కింద బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని దరఖాస్తు చేసుకుని మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం తమకు భూములు ఇచ్చినా నీటి వసతి లేకపోడంతో సాగు చేసేది ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన దర్బార్‌లో వినతులు సమర్పిస్తూనే ఉన్నామని అనేక మంది రైతులు చెప్తున్నారు.

### కరెంటు స్తంభాలు ఎత్తి ఏడాది



నాకున్న పది ఎకరాల్లో బోర్లు వేసుకుని కరెంటు కోసం సొంతంగా డబ్బులు కట్టాను. స్తంభాలు కూడా నాటినం. వైర్లు లాగకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నరు. ఏడాదిగా ఐటీడీఏ అధికారులకు చెప్తూనే ఉన్నా. అటవీశాఖ ఉన్నతాధికారులను కలిసి విన్నవించా. అయినప్పటికీ పట్టించుకోవడం లేదు. నీళ్లు లేకపోవడం వల్ల పంటలు ఎలా సాగు చేయాలో తెలియడం లేదు. అధికారులు వెంటనే స్పందించి కరెంటు ఇప్పించాలి.

– సోయం రామనాథం, బండారుగూడెం

### రెండేళ్లుగా తిరుగుతున్నా..



ఎనిమిది ఎకరాలకు పట్టా ఉంది. ఐటీడీఏ ద్వారా 2017లో ఇందిర జలప్రభ పథకం కింద బోరు వేశారు. ఇప్పటి వరకు కరెంటు సౌకర్యం కల్పించడంలేదు. ఐటీడీఏ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. కరెంటు కోసం డీడీ కట్టుకున్నా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నరు. ఐటీడీఏ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మా అమ్మ పేరిట నాలుగు ఎకరాలు ఉంది. దానికి కూడా నీటి వసతి లేదు.

– చింత నాగేశ్వర్‌రావు, శంకరాజుపల్లి

### బోరుకు కరెంటు లేదు



ఆర్‌వోఎఫ్ఆర్ కింద నాలుగు ఎకరాల భూమి ఉంది. ఐటీడీఏ ద్వారా ఏడేళ్ల కింద బోరు వేశారు. కరెంటు సౌకర్యం కల్పించలేదు. పనిచేయని బోర్లతో పంటలు ఎలా పండించుకుంటం. రొయ్యూరులోని మారేడుకుంట చెరువు నుంచి నీళ్లు వస్తే పంటలు పండుతాయి. లేకుంటే లేదు. అది కూడా ఒకటే సీజన్‌కు. అధికారులు పట్టించుకుని బోర్లకు కరెంటు సౌకర్యం కల్పించాలి.

– తాటి కిష్టయ్య, శంకరాజుపల్లి





## వేతన వెతలు..

# ఆరు నెలలుగా ఎదురు చూపులే

- జడ్పీటీసీ, ఎంపీటీసీలకు అందని వేతనాలు
- కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధులకూ ఇబ్బందులే
- పెండింగ్ బిల్లులకూ తప్పని తిప్పలు

హనుమకొండ, జూలై 10 : రాష్ట్రంలో మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలకు వేతనాలు అందడం లేదు. ఆరు నెలల నుంచి వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీల వేతనాలకు నిధులు మంజూరు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నెల 3తో మండల పరిషత్‌లు, 4వ తేదీతో జిల్లా పరిషత్ పాలక మండళ్ల పదవీ కాలం పూర్తయింది. బీఆర్ఎస్ పాలనలో రెగ్యులర్‌గా వేతనాలు రాగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు అందకపోవడంపై మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖకు నిధుల కొరత ఉండడంతో గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెక్కులు పాస్ కావడం లేదని కొందరు మాజీ జడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు అరకొరగా వస్తున్నప్పటికీ స్టేట్ ఫైనాన్స్ నుంచి ఒక్క రూపాయీ విడుదల చేయలేదని అంటున్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే లోక్‌సభ ఎన్నికల కోడ్ సాకుతో నిధులు మంజూరు చేయలేదు. అయితే కోడ్ ముగిసినా నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థలకు పెండింగ్ నిధులు మంజూరు చేసి మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీల గౌరవ వేతనాలు వెంటనే అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆరు నెలలుగా ఎదురు చూపులు..**

జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీలు గౌరవ వేతనం కోసం ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నారు. జడ్పీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ అర్బన్ జిల్లా (హనుమకొండ) పరిధిలో 86 మంది ఎంపీటీసీలకు ప్రస్తుతం 83 మంది ఉన్నారు. మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అలాగే జిల్లా పరిషత్‌లో ఏడుగురు జడ్పీటీసీలుండగా, ఇందులో ఒకరు చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్ కాగా, మరో ఐదుగురు సభ్యులతో పాటు ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు ఉండేవారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు, కో ఆప్షన్ మెంబర్స్‌కు గౌరవ వేతనంగా నెలకు రూ. 10వేలు, ఎంపీటీసీలకు రూ. 5వేలు ఇస్తున్నారు. వీరందరికీ ఆరు నెలల నుంచి వేతనం పెండింగ్‌లో ఉంది.

### వెంటనే అందించాలి..



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల నుంచి గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. 15వ ఆర్థిక సంఘం నిధులు కొంత వస్తున్నప్పటికీ ఎస్ఎఫ్‌సీ నిధులు మాత్రం రావడం లేదు. అంతేకాక గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి కూడా చెక్కులు బౌన్స్ అయిన సందర్భాలు ఉన్నాయి. మా పదవీకాల పరిమితి గడువు ఇప్పటికే పూర్తయింది. వెంటనే గౌరవ వేతనాలు ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– చాడ సరిత, మాజీ జడ్పీటీసీ, వేలేరు



వాజేడు : ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటుతున్న వైద్య బృందం

# గుట్టలెక్కి.. వాగులు దాటి

- 16 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్య సేవలు
- పెనుగోలు ప్రజలకు మందులు అందజేత

వాజేడు, జూలై 10 : గుట్టలు ఎక్కి, వాగులు దాటి గిరిజన ప్రజలకు వైద్యసేవలందించారు ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యసిబ్బంది. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో గుట్టలపై ఉన్న పెనుగోలు గిరిజన గ్రామానికి మంగళవారం ఉదయం వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో వైద్య బృందం కాలినడకన వెళ్లింది. మూడువాగులు దాటి, మూడు గుట్టలు ఎక్కి సాయంత్రానికి 16 కిలోమీటర్ల దూరంలోని పెనుగోలుకు చేరుకున్నారు. అక్కడ నివసిస్తున్న 10 కుటుంబాల్లోని 39 మందికి వైద్య పరీక్షలు చేశారు. జ్వరాలున్న ముగ్గురిని గుర్తించి మందులు అందజేశారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్ళి దోమల మందు స్ప్రే చేయించారు. అనంతరం బుధవారం మధ్యాహ్నం పీహెచ్‌సీకి చేరుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు చిన్న వెంకటేశ్వర్లు, కోరం శేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ ఇర్ప రజినీకాంత్, సిబ్బంది లకన్, ప్రశాంత్, ఆశ కార్యకర్త సమ్మక్క, గుమ్మడిదొడ్డి గ్రామస్తులు కారం ఆదినారాయణ, జజ్జెరి అశోక్ పాల్గొన్నారు.

**వాగులు దాటుకుంటూ వైద్యం**

గూడూరు : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్యపురం పీహెచ్‌సీ పరిధిలోని మట్టెవాడ శివారు తిమ్మాపురం గ్రామానికి వైద్యసిబ్బంది వాగులు, వంకలు దాటుకుంటూ 8 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సదర్భంగా డాక్టర్ యమున మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లోనే గిరిజనులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. 42 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు దేవేందర్, నరేశ్, సిబ్బంది లోక్యానాయక్, అరుణ, హేమలత, రజిత, సర్దార్, లాలు, కవిత, ఆశ, సీతమ్మ పాల్గొన్నారు.















































